సాక్షి మంచిర్యాల

సోమవారం ׀ 30 ׀ సెప్టెంబర్ ׀ 2024



దసరాకు ఆర్టీసీ సిద్ధం

దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అక్టోబర్ 1 నుంచి 11వ తేదీ వరకు నడిపేందుకు సన్నద్ధమవుతోంది. 8లో▸

ఉమ్మడి ఆదిలాబాద్ రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా ఎం.రవీందర్‌రావు నియామకం అయ్యారు. ఇదివరకు డీఆర్‌గా పనిచేసిన సీహెచ్ అశోక్‌కుమార్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో హైదరాబాద్ దక్షిణ డీఆర్‌గా ఉన్న రవీందర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /26.3

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వేడి, ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి రవి

జైపూర్: విద్యార్థులు ఉన్నతమైన వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ దిశానిర్దేశం చేసుకోవాలని, అన్నిరకాల చట్టాలపై అవగాన పెంచుకోవాలని చెన్నూర్ సివిల్ కోర్టు జడ్జి పి.రవి సూచించారు. జైపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. విద్యార్థి దశ కీలకమైనదని, తెలిసీ తెలియని వయసులో తప్పులు చేసి బంగారు భవిష్యత్ పాడు చేసుకోవద్దని సూచించారు. మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు చట్ట పరిధిలోనే ఉంటాడని, చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. కొత్త చట్టాలు, వాటి అమలు తీరు, సైబర్ నేరాలపై న్యాయవాదులు, పోలీసులు వివరించారు. కార్యక్రమంలో చెన్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్, సీనియర్ న్యాయవాదులు కమల మనోహర్‌రావు, కార్తీక్, న్యాయవాదులు బండారి శ్రీనివాస్, ఎస్సై శ్రీధర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిగీతాల గ్రంథాలు ఆవిష్కరణ



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న ముఖేష్‌గౌడ్

మంచిర్యాలఅర్బన్: స్థానిక సుచిత్ర కాంప్లెక్స్‌లో ప్రముఖ కవి, రచయిత డాక్టర్ శ్రీనాథ్‌గౌడ్ రచించిన పరమేశ్వర భక్తిగీతాలు, శ్రీలక్ష్మీ, పార్వతి, సరస్వతి, శ్రీఅంజనేయ, సూర్యానారాయణ భక్తిగీతాల గ్రంథాలను మున్సిపల్ మాజీ వైస్ ౖచైర్మన్ ముఖేష్‌గౌడ్ ఆదివారం అవిష్కరించారు. ఈసందర్భంగా ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి వీడియోకాల్ చేసి శ్రీనాథ్‌గౌడ్‌తో ఉన్న పరిచయం, రచనాశైలి గురించి కుప్లంగా వివరించారు. గొల్లపల్లి శ్యామల, దాసరిపద్మ గ్రంథంలోని గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎఫ్‌పీసీ ప్రిన్సిపాల్ ఎంవీ.పట్వర్ధన్, న్యాయవాదులు ప్రతాప్, లచ్చన్న, కవులు రాజేశం, మలయశ్రీ, అల్లాడి శ్రీనివాస్, అంజిబాబు, నోముల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో హైదరాబాద్



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సోమవారం చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ ఓసీపీ ఆవరణలో కార్యక్రమ పోస్టర్ ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంచాలని, కనీస వేతనాలు జీవో ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2007 నుంచి వేతనాలు పెరుగక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తలపెట్టిన ఆందోళనలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్, తిరుపతి, సతీశ్, గోపాల్, రమేశ్ పాల్గొన్నారు.

గనులపై దసరా వేడుకలు నిర్వహించుకునేలా చర్యలు



జనక్‌ప్రసాద్‌తో సమావేశమైన నాయకులు

తాండూర్: బొగ్గు గనులపై దసరా వేడుకలు జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంతో ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, మినిమం వేజేస్ బోర్డు అడ్వైజరీ కమిటీ చైర్మన్ జనక్‌ప్రసాద్ సంప్రదింపులు జరుపుతున్నట్లు యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లో జనక్ ప్రసాద్‌తో ఐఎన్‌టీయూసీ నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపల్లి సమ్మయ్య, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేందర్, నాయకులు నారాయణ ,రమేష్, సంతోష్, తిరుపతి పాల్గొన్నారు. సమావేశంలో జనక్‌ప్రసాద్ మాట్లాడారు. దసరా వేడుకల్లో భాగంగా గనులపై విందు భోజనం ఏర్పాటు చేయడానికి చర్చలు జరుపుతున్నటుల తెలిపారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ ఆర్‌ఎంపీ జ్వరంతో బాధపడుతున్న పాపకు చికిత్స చేశాడు. జ్వరం తగ్గకపోగా మరుసటి రోజు చిన్నారికి ఫిట్స్ వచ్చింది. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మరణించింది. ఆర్‌ఎంపీ హెవీ డోస్ ఇంజక్షన్లు, యాంటీబయాటిక్స్ ఇవ్వడంతోనే మృతి చెందినట్లు తెలియగా, విషయం బయటకు పొక్కకుండా మేనేజ్ చేసినట్లు తెలిసింది.

లక్సెట్టిపేట్ మండలం కొత్త కొమ్ముగూడెం గ్రామ పంచాయతీ పరిధి కొర్విచెల్మ గ్రామానికి చెందిన బత్తుల మధుకర్(26)కు ఈనెల 18న జ్వరం రావడంతో ఆర్‌ఎంపీ శ్రీనివాస్ వద్దకు తీసుకెళ్లారు. చికిత్స పేరుతో సెలైన్‌తోపాటు మూడు ఇంజక్షన్లు ఇచ్చాడు. కాసేపటికి చలి పెరగడంతో మళ్లీ ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లాడు. ఇంజక్షన్ డోసు ఎక్కువైందని మంచిర్యాల ఆస్పత్రికి తరలించాడు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈనెల 21న బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. 24 మరణించాడు.

ఆర్‌ఎంపీ వైద్యం.. ప్రాణ సంకటం

- ట్రీట్‌మెంట్ వికటించి వారం వ్యవధిలో ఇద్దరికి బ్రెయిన్‌డెడ్
- అర్హత లేని వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు
- అనుమతులు లేకుండానే ఆస్పత్రులు, నర్సింగ్‌హోంల నిర్వహణ
- చోద్యం చూస్తున్న జిల్లా వైద్యాధికారులు



మంచిర్యాలటౌన్: అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సను మాత్రమే అందించాల్సిన ఆర్‌ఎంపీలు(రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్), పీఎంపీలు(ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్) అనుమతులు, అర్హతలు లేకున్నా ఏకంగా నర్సింగ్‌హోంలు, ఆస్పత్రులను నిర్వహిస్తూ వైద్యులుగా మారుతున్నారు. ఇష్టారీతిన ఇంజక్షన్లు, హైడోస్ మందులు ఇస్తూ ప్రాణాల మీదకు తెస్తున్నారు. కొందరు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు బోర్డులను ఏర్పాటు చేసుకుని, అందులోనే మెడికల్ షాపులు, ల్యాబ్‌లు నిర్వహించడంతో పాటు, బెడ్‌లను ఏర్పాటు చేసి రోజుల తరబడి చికిత్స అందిస్తున్నారు. తెలిసీ... తెలియని వైద్యం చేస్తూ నిండు ప్రాణాలను బలితీసుకుంటున్నారు. జిల్లాలో వా రం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యం వికటించి మరణించారు. దీంతో ఆర్‌ఎంపీ వైద్యం అంటేనే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. మ రణించిన ఇద్దరూ బ్రెయిన్ డెడ్ అయి మరణించడంతో హైడోస్ కారణంగానే మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. ఇలాంటి ఘటనలు గతంలోనూ జరిగాయి. నిబంధనలు అతిక్రమించి వైద్యం చేస్తున్న వారి వివరాలు సేకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తనిఖీలు నిర్వహించింది. తూతూమంత్రంగా చర్యలు తీసుకోవడంతో ఆర్‌ఎంపీ, పీఎంపీలు తమ అనుమతి లేని వైద్యం కొనసాగిస్తున్నారు. ప్రథమ చికిత్సకు మాత్రమే అర్హులైన ఆర్‌ఎంపీలు, పీఎంపీలు చికిత్స పేరుతో అందినకాడికి దండుకుంటున్నారు.

రోగమేదైనా చికిత్స..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏ చిన్న రోగం వచ్చినా వెంటనే స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ఫోన్ చేసి ఇంటికి పిలిపిస్తున్నారు. వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని చికిత్స పొందుతున్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు వ్యాధిపై అవగాహన లేకపోయినా.. వచ్చిరాని వైద్యం చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. హైడోస్ ఇంజక్షన్లు, విచ్చలవిడిగా యాంటిబయాటిక్స్ ఇస్తున్నారు. దీంతో తాత్కాలిక ఉపశమనం కలిగినా సైడ్ ఎఫెక్ట్‌లతో రోగులు ఇబ్బందిపడుతున్నారు. ఒక్కోసారి ప్రాణాలమీ దకు వస్తోంది. హైడోస్ మందులతో లివర్, కిడ్నీ, ప్రధాన అవయవాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది.

అడ్డుకట్ట వేయకుంటే కష్టమే....

జిల్లాలో వందలాది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఉన్నారు. వీరు చేయాల్సింది కేవలం ప్రాథమిక చికిత్సే. అంతకుమించి వైద్యం చేయడం నేరం. ఇంజక్షన్లు ఇవ్వడం, ఫ్లూయిడ్స్ ఎక్కించడం, కనీసం ప్రిస్కిప్షన్ కూడా రాయడానికి వీలులేదు. మరికొందరు అబార్షన్లు సైతం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బోర్డుపై క్లినిక్ అని కాకుండా, ప్రథమ చికిత్సాలయం అని మాత్రమే రాసుకోవాలి. పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోవద్దు. కానీవారు మాత్రం వీటిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ప్రథమ చికిత్సకు బదులుగా వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు ఏజెంట్లుగా..

ఇక ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలు నిర్వహించడమే కాకుండా కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు ఏజెంట్లుగా కూడా పనిచేస్తున్నారు. రోగులను రెఫర్‌చేసినందుకు ఆస్పత్రుల నుంచి కమీషన్ తీసుకుంటున్నారు. రోగులను ప్రభుత్వ ఆస్పత్రులకు రాకుండా చేస్తున్న వీరిపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వైద్య శాఖ తీరుపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

కేవలం ప్రథమ చికిత్సను మాత్రమే అందించాల్సిన ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో కేవలం వారం రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడం బాధాకరం. ఈ ఘటనలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఆర్‌ఎంపీలు అందిస్తున్న వైద్యంతోపాటు, వారు నిర్వహిస్తున్న ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలు తనిఖీ చేస్తాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి గృహిణి మృతి



క్లినిక్ వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్సై



శ్రీలత(ఫైల్)

నస్పూర్: ఆర్‌ఎంపీ వైద్యం వికటించి నస్పూర్ పట్టణంలోని నాగార్జున కాలనీకి చెందిన చింత శ్రీలత(24) మృతిచెందింది. నస్పూర్ ఎస్సై సుగుణాకర్, మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–7 గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహించే రాజు భార్య, కూతురుతో కలిసి నాగార్జున కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 27న రాత్రి జ్వరం రావడంతో 28న స్థానిక పీఎంపీ బిరుదుల ప్రశాంత్‌ను ఇంటికి పిలిపించి చికిత్స చేయించాడు. పీఎంపీ సెలైన్ పెట్టాడు. పారాసిటమాల్ ఇంజక్షన్ ఇచ్చాడు. చలి పెరగడంతో బాధితురాలు విషయాన్ని పీఎంపీకి తెలిపింది. దీంతో మరో ఇంజక్షన్ ఇచ్చాడు. ఇక శనివారం తన కూతురు పుట్టిన రోజు కూడా ఉండడంతో రాజు కూతురును తీసుకురావడానికి స్కూల్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి శ్రీలత వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆందోళన చెంది రాజు పీఎంపీకి సమాచారం ఇవ్వగా మంచిర్యాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాలకు తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కరీంనగర్ తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆదివారం ఆమె బ్రెయిన్ డెడ్ అయ్యిందని తెలిపారు. తరువాత మృతి చెందిందని నిర్ధారించారు. భార్యకు పీఎంపీ ఇచ్చిన వైద్యం వికటించడంతోనే మృతి చెందిందని పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు పీఎంపీ బిరుదుల ప్రశాంత్, ఓ మెడికల్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. చికిత్సకు వాడిన మందులు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

ఒకటికి మించి కేసులుంటే రౌడీషీట్

- డీసీపీ భాస్కర్



రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఒకరిపై ఒకటికంటే ఎక్కువ కేసులు నమోదైతే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని డీసీపీ భాస్కర్ హెచ్చరించారు. జిల్లా సాధారణ తనిఖీల్లో భాగంగా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆదివారం తనిఖీ చేశారు. సీసీసీ పిటిషన్స్, వాటి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరు తెలుసుకున్నారు. నమోదు చేసిన కేసుల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ప్రజలతో.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో సిబ్బంది ప్రవర్తించే తీరును పరిశీలించారు. బాధితుల ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు నమోదైన కేసులను పరిశీలించారు. స్టేషన్లకు వచ్చేవారితో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకుపాల్పడే వారి వివరాలతో సమాచారం అందించాలని తెలిపారు. వ్యభిచారం దందా సాగిస్తున్న వారిపై, వారికి సహకరించిన వారిపై నిఘా ఉంచాలని, వారి గృహాలను, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. డీసీపీ వెంట ఏసీపీ ఆర్.ప్రకాశ్, సీఐ బన్సిలాల్ ఉన్నారు.

జార్జిరెడ్డి స్ఫూర్తితో ఉద్యమిద్దాం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జార్జిరెడ్డి స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీకాంత్ అన్నారు. మంచిర్యాల జిల్లా గఢ్‌పూర్ ఎస్టీ బాలుర వసతి గృహంలో పీడీఎస్‌యూ వజ్రోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ 50 ఏళ్ల పీడీఎస్‌యూ ప్రస్థానంలో అనేక మంది విద్యార్థులు ప్రాణాలు వదిలారని తెలిపారు. కామ్రేడ్ జార్జిరెడ్డి మతోన్మాది కత్తిపోట్లకి ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నేలకొరిగాడని తెలిపారు. ఏ విద్యార్థి సంఘాలనికి లేని చరిత పీడీఎస్‌యూకు ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధా నం రద్దు కోసం పీడీఎస్‌యూ నిత్యం పోరాటాలు చేస్తోందని తెలిపారు. అమరవీరుల ఆశయాలని ఎత్తిచూపుతూ, పీడీఎస్‌యూ పోరాట స్ఫూర్తిని వివరిస్తూ 50 ఏళ్ల సందర్భంగా అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే భారీ బహిరంగ సభలో పూర్వ, ప్రస్తుత పీడీఎస్‌యూ నాయకుల, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజేశ్, చైతన్య, ప్రశాంత్, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్దుబాటు చదువులు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది దండేపల్లి మండలం కంచరబాయి గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాల. గతనెల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలతో ఈ పాఠశాల ఉపాధ్యాయుడు వేరే చోటికి బదిలీ అయ్యాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈపాఠశాలకు ఉపాధ్యాయుడిని కేటాయించలేదు. పాఠశాల మూతపడకుండా ఉండేందుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నా కొన్ని సందర్భాల్లో పాఠశాల సక్రమంగా తెరవలేదు. వినాయక చవితి తరువాత కొన్ని రోజులు మూసే ఉంది. విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో మరో టీచర్‌ను సర్దుబాటు చేసి పాఠశాలను తెరిచారు.

- టీడబ్ల్యూపీఎస్‌లో ఉపాధ్యాయుల కొరత..

దండేపల్లి: విద్య, వైద్యానికి ప్రాముఖ్యతను ఇస్తున్నట్టు ప్రభుత్వం చెబుతున్నా కొన్నిచోట్ల అది క్షేత్రస్థాయిలో కార్యరూపందాల్చడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఆగస్టులో గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయి. ఉపాధ్యాయుల కొరత కారణంగా బదిలీలు జరిగి నెలరోజులు గడుస్తున్నా కొన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల కేటాయింపు జరగలేదు. దీంతో ఇతర పాఠశాలల ఉపాధ్యాయులను, ఉపాధ్యాయుడు లేని పాఠశాలలకు సర్దుబాటుచేసి చదువులు సాగిస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

మంచిర్యాల జిల్లాలో 55 గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఉండగా, అందులో సుమారు 650 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సుమారుగా 43 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పాఠాలు బోధించేందుకు ఇంకా 12 మంది అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం కనీసం వీవీలు, లేదంటే, సీఆర్టీల నియామకం కూడా చేపట్టడంలేదు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న చోటు నుంచి, ఒక్కరిని, ఉపాధ్యాయుడు లేని పాఠశాలకు పంపి సర్దుబాటు చేశారు. అయినా కొన్ని చోట్ల పాఠశాలలు సక్రమంగా తెరుచుకోవడం లేదు. దీంతో ఆ పాఠశాలల విద్యార్థుల చదువుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈవిషయంలో సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి, వీవీలు, లేదా సీఆర్టీల నియామకం చేపట్టి, ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు వారిని కేటాయించి చదువులు సాగించాలని పలువురు కోరుతున్నారు.

సర్దుబాటు చేస్తున్నాం..

జిల్లాలోని గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. దీంతో ఉపాధ్యాయులు లేని పాఠశాలలు మూతపడకుండా ఇద్దరు ఉన్న చోటునుంచి ఒకరిని ఉపాధ్యాయుడు లేని పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నాం. అయినా అప్పుడప్పుడు కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సీఆర్టీల నియామకం గురించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఆదేశాలు రాగానే, సీఆర్టీల నియామకం చేపట్టి చదువులకు ఆటంకం లేకుండా చూస్తాం.

– గంగారాం, డీటీడీవో

పోలీస్ బెటాలియన్‌లో స్పోర్ట్స్ మీట్



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న వెంకటరాములు



బెటాలియన్‌లో స్పోర్ట్స్ మీట్ వేడుకలో క్రీడా జ్యోతితో కమాండెంట్ వెంకటరాములు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ కానిస్టేబుళ్లకు ఆదివారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు క్రీడాజ్యోతి వెలిగించారు. అనంతరం శాంతి కపోతాలు, బెలూన్లు గాలిలోకి ఎగురవేసి పోటీలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని తెలిపారు. బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్ శిక్షణ కానిస్టేబుళ్లకు నూతనోత్తేజాన్ని ఇస్తాయన్నారు. వారి శిక్షణ కూడా మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతుందని తెలిపారు. వేడుకల్లో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.నాగేశ్వర్‌రావు, ఆర్ఐలు, ఏఆర్ఎస్సైలు, వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షణ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రజలను విభజించి పాలిస్తున్న బీజేపీ



ఎర్రజెండాను ఎగురవేస్తున్న రమణ

బెల్లంపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతాల పేరుతో ప్రజలను విభజించి పాలిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.ప్రకాశ్ విమర్శించారు. బెల్లంపల్లి ఏరియా కమిటీ సీపీఎం మహాసభ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు ఎ.రమణ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ప్రజా పోరాటాల్లో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. మహా సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. బీజేపీ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశ పరిస్థితులు చిన్నాభిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. పేదల బతుకులు మారడం లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని తెలిపారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తోందని విమర్శించారు. హామీలను అమలు చేయడానికి చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.

ఏరియా కన్వీనర్‌గా అశోక్..

సీపీఎం బెల్లంపల్లి ఏరియా కమిటీ కన్వీనర్‌గా జి.అశోక్ ఎన్నికయ్యారు. సభ్యులుగా దాగం రాజారాం, ఎ.రమణ, చల్లూరి దేవదాస్, మల్లేశ్వరి, దుర్గం సజీవన్, దాగం శ్రీకాంత్, జి.భీమయ్య, బాగాల రాజన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



మాట్లాడుతున్న రఘునాథ్

తాండూర్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ విమర్శించారు. తాండూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. గ్రామీణులు జ్వరాలతో మంచం పట్టి అల్లాడుతుంటే ఎమ్మెల్యే హైదరాబాద్‌లో ఉండి చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేయడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకు పోయాయని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్యం పడకేసిందన్నారు. కనీసం బ్లీచింగ్ ఫౌడర్ కూడా చల్లించడం లేదని, మురికి నీటి కాలువలు శుభ్రంగా లేక దోమలు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. తాండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. గత ఎమ్మెల్యేమాదిరిగానే ప్రస్తుత ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఐబీ సెంటర్‌లో, కూరగాయల సంత వద్ద సామూహిక మరుగు దొడ్లు నిర్మించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, సభ్యత్వ నమోదు కన్వీనర్ కృష్ణమూర్తి, కోకన్వీనర్ కృష్ణదేవరాయలు, దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుధీర్‌గౌడ్, నాయకులు చిలువేరు శేషగిరి, తుకారాం, మహీదర్‌గౌడ్, పుట్టకుమార్, సిద్దం మల్లేశ్, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

బతుకమ్మ పాట చిత్రీకరణ



బతుకమ్మ పాట చిత్రీకరణలో భాగంగా నటులతో కృష్ణ

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లికి చెందిన గొడిసెల కృష్ణ బతుకమ్మ పాట చిత్రీకరణ కొనసాగుతుంది. పలు యూట్యూబ్ చానళ్లకు జానపద పాటలు రాస్తూ, రచయితగా పేరు తెచ్చుకుంటున్న కృష్ణ నాలుగు సంవత్సరాల నుంచి ప్రతీ బతుకమ్మ పండుగకు యూట్యూబ్ చానల్‌లకు పాటలు రాసిస్తూ మండలానికి పేరు తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో ఈ సంవత్సరం సైతం ఒక సరికొత్త బతుకమ్మ వీడియో సాంగ్ 'ఓయిలాలో నా రామ సెందురాలో' అనే సాంగ్‌ను జిల్లాలోని పలు లొకేషన్‌లలో వీడియో ఆల్బమ్‌ను చిత్రీకరిస్తున్నారు. రుచిత క్రియేషన్స్ ద్వారా నిర్మిస్తున్న సాంగ్ రచయితగా కృష్ణ, గానం దుర్గం సునీత, హన్మంతుయాదవ్, హీరో హిన్ నీతుక్విన్, నటీనటులుగా మురళి, సునీత, పోశన్న, అరుణ, తనుశ్రీ నటించారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో ఆత్మహత్య

భైంసారూరల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పాంగ్రి గ్రామానికి చెందిన రాంకూరే గణేశ్ (26) గత రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు మద్యం తాగి కుటుంబీకులతో గొడవపడేవాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికివచ్చి కుటుంబీకులతో గొడవపడి చచ్చిపోతా అంటూ వెళ్లిపోయాడు. అతని కోసం వెళ్లగా గ్రామశివారులో చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. గణేశ్‌ను వెంటనే భైంసా ఏరియాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. భార్య గంగాసాగర ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడకు చెందిన లింగాల కిరణ్ కుమార్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్‌రూరల్ ఏఎస్సై మారుతి కథనం ప్రకారం.. కిరణ్‌కుమార్ (35) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొన్నినెలలుగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో భార్యతో గొడవపడేవాడు. నెల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం తండ్రి శ్రీనివాస్ గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. భార్య శిరీష ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో మేకల కాపరికి గాయాలు

తిర్యాణి: మండలంలోని బోడగూడలో ఎలుగుబంటి దాడిలో మేకల కాపరికి తీవ్ర గాయాలయ్యాయి. గోపెర ఫారెస్టు సెక్షన్ అధికారి మల్లయ్య కథనం ప్రకారం.. గిన్నెదరి రేంజ్ పరిధిలోని గోపెర సెక్షన్‌కు, కైరిగూడ బీట్ పరిధిలోని బోడగూడ అటవీప్రాంతంలో అదే గ్రామానికి మేకల కాపరి పంద్రం బగ్గు తన మేకలను మేపి శనివారం సాయంత్రం ఇంటికి వస్తుండగా పిల్లలతో కూడిన ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో బగ్గు కాలికి తీవ్రగాయమైంది. స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితుడికి నష్టపరిహారం అందేలా చూస్తామని పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి ప్రధాన రహదారిలో అక్రమంగా తరలిస్తున్న పశువులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కౌటాల మండల కేంద్రంతో పాటు బెజ్జూర్ మండలంలోని సలుగుపల్లి, మర్థిడి గ్రామాల నుంచి అనుమతి లేకుండా నాలుగు వాహనాల్లో 36 పశువుల ను తరలిస్తున్నారు. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించారు. వాహనాలను సీజ్‌చేసి చేసి, పశువులను అక్రమంగా తరలిస్తున్న జగిత్యాల జిల్లాలోని చిన్నకోడూరు, గొల్లపల్లి గ్రామాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దసరాకు ఆర్టీసీ సిద్ధం

- అక్టోబర్ 1 నుంచి 11 వరకు ప్రత్యేక బస్సులు
- ప్రయాణికుల రద్దీకనుగుణంగా ఏర్పాట్లు
- ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 412 సర్వీసులు



ఆదివారం మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

మంచిర్యాలఅర్బన్: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అక్టోబర్ 1 నుంచి 11వ తేదీ వరకు నడిపేందుకు సన్నద్ధమవుతుంది. ఆయా ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. స్కూల్, కళాశాలలకు పండుగ సెలవులు ఉన్నందున ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇంకోవైపు ట్రాక్ మరమ్మతు నేపథ్యంలో రైళ్ల బంద్‌తో బస్సులను ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ రీజియన్‌లో ఆయా డిపోల నుంచి 412 బస్సులను జేబీఎస్ (హైదరాబాద్ నుంచి) ప్రత్యేకంగా నడపడానికి సన్నాహాలు చేస్తోంది.

మంచిర్యాల నుంచి ఎక్కువ బస్సులు..

పండుగ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల నుంచి ఎక్కువగా బస్సులు నడపనున్నారు. రీజియన్ వారీగా 412 బస్సులు నడపనుండగా మంచిర్యాల నుంచి 125 బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. నిర్మల్ నుంచి 120, ఆదిలాబాద్ 78, ఆసిఫాబాద్ 73, భైంసా 11, ఉట్నూర్ 05 బస్సులు నడపనున్నారు. హైదరాబాద్‌లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం వెళ్లినవారు స్వగ్రామాలకు పయనం కానున్నారు. పండుగ వేళ ట్రాక్ మరమ్మతు పేరిట కాగజ్‌నగర్, పుష్పుల్, రామగిరి, ఇంటర్‌సిటీ రైళ్లు రద్దు చేశారు. గోరఖ్‌పూర్–కొచ్చువెల్లి, ఎర్నాకులం, శ్రీవైష్ణోదేవి–చెన్నై, కాజీపేట్–పుణె పలు వీక్లీరైళ్లు రద్దు, దారి మళ్లింపు చేశారు. ఇంకోవైపు మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళల రద్దీ పెరిగింది. ఈనేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు టికెట్లు రిజర్వేషన్లు చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో నడిచే బస్సుల కంటే ప్రత్యేక బస్సులు నడిపి ఆదాయం సమకూర్చేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. జేబీఎస్‌లో ప్రయాణికుల సమాచారం కోసం ఆయా డిపోల నుంచి ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

గతేడాదికంటే ఎక్కువ..

ఆర్టీసీ గతేడాది కంటే ఈ ఏడాది పండుగకు అదనంగా బస్సులు నడపనుంది. గతేడాది సెప్టెంబర్ 13 నుంచి 22 వరకు 404 బస్సులు నడపగా, ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి 11 వరకు 412 బస్సులు ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనున్నారు. గతేడాది మంచిర్యాల నుంచి 116, నిర్మల్ నుంచి 108 ఆదిలాబాద్ నుంచి 87 బస్సులు నడపగా ఈ ఏడాది కాస్త బస్సుల సంఖ్య పెంచారు.

డిపోల వారీగా..అక్టోబర్ 1నుంచి 11 తేదీ వరకు

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఉట్నూర్	మంచిర్యాల	ఆసిఫాబాద్
1	6	1	12	0	15	6
2	2	0	5	0	4	3
3	3	0	5	0	5	3
4	2	0	5	0	4	3
5	12	2	16	1	18	11
6	5	1	8	1	6	6
7	4	0	5	0	7	3
8	3	0	5	0	4	3
9	12	2	16	1	18	11
10	13	2	18	1	20	11
11	16	3	23	1	24	13

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా..



దసరా పండుగ వేళ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్సులు నడపనుంది. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ బస్సులు నడపనున్నాం. ప్రయాణికులకు ఇక్కట్లు లేకుండా ఆయా బస్‌స్టేషన్ల వద్ద సమాచారం అందించేందుకు ప్రత్యేక సిబ్బంది నియమించాం. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

– సోలోమాన్,
ఆర్టీసీ రీజియనల్ మేనేజర్, ఆదిలాబాద్

ఆర్కే 5 గనిపై చోరీ

- ట్రంక్‌పెట్టెల్లో ఫోన్లు, నగదు అపహరణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిపై శనివారం రాత్రి చోరీ జరిగింది. గనిపై కార్మికులు తమ సామగ్రిని భద్రపరుచుకునే ట్రంక్ పెట్టెలను పగులగొట్టి దొరికినకాడికి దొంగలు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం డ్యూటీ ముగించుకుని కార్మికులు వచ్చేసరికి తాళాలు పగులగొట్టి తెరిచి ఉన్నాయి. రూ.3 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు, రూ.10 వేల నగదు, కొన్ని బైక్ కీలు చోరీకి గురయ్యాయని బాధితులు గని అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎస్‌అండ్‌పీసీ అధికారుల నిర్లక్ష్యంతోనే: ఏఐటీయూసీ

ఎస్‌అండ్‌పీసీ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ చోరీలు పునరావృతం అవుతున్నాయని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని డెప్యూటీప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీ షేక్ బాజీసైదా సందర్శించారు. కార్మికులకు పటిష్టమైన లాకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఫిట్ సెక్రెటరీగునిగంటి నర్సింగరావు, నాయకులు అఫ్రోజ్ ఖాన్,నాగుల రాజయ్య, సతీశ్, రమేశ్ ఉన్నారు.



పగులగొట్టి ఉన్న ట్రంక్ పెట్టెలు

పటిష్ట చర్యలు చేపట్టాలి: టీబీజీకేఎస్

గనులపై రక్షణ చర్యలు పటిష్టంగా చేపట్టాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కార్మికులతో మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. డెప్యూటీ జనరల్ సెక్రెటరీ బండి రమేశ్, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, దుర్గం రవి, ముస్త్యాల రమేశ్, గొర్ల సంతోశ్, గోపి నాయక్, ఎండీ లాల ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కాసిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన అపూర్వ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. 25 ఏళ్ల తర్వాత ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ సీఐడీ అడిషనల్ ఎస్పీ రవికుమార్ హాజరై మాట్లాడారు. మానవీయ సంబంధాలు మెరుగుపడాలంటే ఇలాంటి సమ్మేళనాలు ఎంతో అవసరమన్నారు. – కాసిపేట

రాంనరేశ్‌కు గవర్నర్ ప్రశంస

- జిల్లా ఉపాధ్యాయుడికి అభినందన లేఖ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా సాహితీ ఖిల్లాగా పేరుగాంచింది. తాజాగా జిల్లాకు చెందిన కవి, రచయిత, సాహితీవేత్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వకుళాభరణం రాంనరేశ్ కుమార్ సాహితీకళకు గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ ప్రశంస దక్కింది. భైంసా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఈయన 'వినరా భారతీయ వీరచరిత్ర..పేరిట దేశ చారిత్రక వీరుల కథాంశాలను శతక పద్య రూపక పుస్తకంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఇది ప్రచురణ దశలో ఉంది. త్వరలో విడుదల కానున్న పుస్తకాన్ని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, గవర్నర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పుస్తకాన్ని ఆయన చదివి ప్రశంసించారు. సాహితీ నైపుణ్యం, జాతీయవాద చరిత్రపై రాంనరేశ్‌కు ఉన్న మక్కువపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రెండురోజుల క్రితం అభినందన లేఖను పంపారు. రాంనరేశ్ గతంలో అనేక కథాంశాలతో పలు కవితలను రచించారు.



పద్య శతక గ్రంథం ముఖచిత్రం ఇదే

అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్టు

- నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం
- కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు

ఆదిలాబాద్‌టౌన్: జల్సాలకు అలవాటుపడి బైక్‌లు చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను టూటౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం..ఈనెల 22న రాత్రి సమయంలో ఖుర్షీద్‌నగర్ కాలనీలోని అరార పెట్రోల్‌బంక్ నుంచి తన బైక్ చోరీకి గురైనట్లు తిర్పెల్లికి చెందిన బాధితుడు షేక్ అజీమ్ అహ్మద్ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేశారు. ఎస్సై విష్ణుప్రకాశ్, కానిస్టేబుళ్లు నరేశ్, నరేందర్, సుధాకర్‌రెడ్డి, సంజీవ్, రమేశ్, గోపాల్, హెడ్‌కానిస్టేబుల్ మదన్, రమణయ్య ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట వాహనాలు తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి బైక్ అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. నేరడిగొండ మండలం బుగ్గారం తండాకు చెందిన బుక్య కృష్ణరాథోడ్ దొంగతనానికి పాల్పడినట్లు తెలిపాడు. ఆదిలాబాద్‌లో 2, నిర్మల్‌లో 1, భైంసాలో 1 బైక్‌లు దొంగతనం చేసినట్లు పేర్కొన్నారు. ఇదివరకు కరీంనగర్‌లో 3, నిజామాబాద్‌లో 1, మెదక్ జిల్లా రామాయంపేటలో 1, కామారెడ్డిలో 1, నిర్మల్ జిల్లా కడెం, భైంసా, నిర్మల్‌లో ఒక్కొక్కటి చొప్పున బైక్‌లు చోరీ చేసినట్లు తెలిపారు. బైక్‌ల దొంగతనం కేసులో ఇప్పటికే మూడుసార్లు జైలుకు వెళ్లినట్లు వివరించారు.



నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ

బాల్‌బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర జట్టుకు తృతీయ బహుమతి



తృతీయ బహుమతి అందుకుంటున్న రాష్ట్ర జట్టు

రెబ్బెన(ఆసిఫాబాద్): హర్యానా రాష్ట్రంలోని రోతక్ జిల్లాలో జరిగిన 43వ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తృతీయస్థానంలో నిలిచినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాకు చెందిన దామర ప్రేమ్‌దీప్ రాష్ట్రజట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించటంతోపాటు పోటీల్లో అద్భుత ఆటతీరును ప్రదర్శించి జట్టు గెలుపు కోసం కృషి చేసినందుకుగాను బెస్ట్ టాప్ ఫైవ్ ప్లేయర్‌లో బెస్ట్ అవార్డును సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రేమ్‌దీప్..2023లో కర్ణాటకలో జరిగిన సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాడు. బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందిన సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రేమ్‌దీప్‌ను అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా జీఎం శ్రీనివాస్, సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ తిరుపతి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సింగం అభినందించారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



తల్లికి చిన్నారిని అప్పగిస్తున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రిరూరల్: తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని శ్రీపతినగర్‌కు చెందిన చిన్నారి సన్‌ఫిర్దోశ్(5) ఆదివారం ఉదయం కిరాణం దుకాణానికి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు 100 డయల్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఎస్సై ఆధ్వర్యంలో ఆరు పోలీసు బృందాలు గాలింపుచర్యలు చేపట్టారు. దీపక్‌నగర్ ఏరియాలో చిన్నారి సుమారు మూడున్నర గంటల తర్వాత కనిపించింది. ఎస్సై రాజశేఖర్ ఆ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

పత్తికి సూక్ష్మపోషకాలు తప్పనిసరి

- మొక్కల ఎదుగుదలకు కాంప్లెక్స్ ఎరువులు వాడాలి
- జింక్, బోరాన్, మెగ్నీషియం అవసరం



పత్తిలో జింక్ లోపంతో రంగు మారిన ఆకులు



బోరాన్ లోపంతో ఎర్రబారిన పత్తి

చెన్నూర్‌రూరల్: పత్తి పంటకు అందించే ప్రధాన మూలకాలు లేదా పోషకాలు నత్రజని (యూరియా, డీఏపీ, కాంప్లెక్స్), పాస్ఫరస్(పి) సింగిల్ పాస్ఫేట్, పొటాష్ (మ్యూరేట్‌ఆఫ్ పొటాష్, మల్టికె కాంప్లెక్స్ అందిస్తారు. వీటితోపాటు మొక్కల ఎదుగుదల, కాయల అభివృద్ధి, పత్తి నాణ్యత, దిగుబడి పెరగడానికి జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర సూక్ష్మపోషకాలు అందించడం తప్పనిసరని చెన్నూర్ ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ సూచించారు.

జింక్: జింక్ లోపంతో విత్తనాలు విత్తిన మూడు వారాల తర్వాత మొక్క మధ్య ఆకులపై కనిపిస్తుంది. ఆకుల ఈనెలు, ఆకుపచ్చగా ఉండి ఈనెల మధ్య భాగం పసుపు పచ్చగా మారుతుంది. గోధుమరంగు మచ్చలు ఆకుల చివర్ల నుంచి మొదలుకు వ్యాపిస్తాయి. ఆకుచివర్లు ఎండిపోతాయి. కొమ్మ చివరి ఆకులు చిన్నవిగా ఉండి ముడతలు పడి కణుపుల మధ్య దూరం తగ్గిపోతుంది. మొక్కలు చిన్నవిగా గుబురుగా కనిపిస్తాయి.

నివారణ చర్యలు: జింక్ లోపం ఉండకుండా ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్‌సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్‌లోపం కనిపించగానే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి ఐదు రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారి చేయాలి.

బోరాన్: మొక్క జీవనక్రియలో బోరాన్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. మొక్కలో సున్నం, పొటాష్ పోషకాలను క్రమబద్ధీకరిస్తుంది. మొక్క సున్నాన్ని సక్రమంగా వినియోగించుకోవడానికి బోరాన్ అవసరం ఉంటుంది. సున్నంపాటు ఎక్కువగా ఉన్న నేలల్లో వర్షాభావ పరిస్థితుల్లో అధిక వర్షపాతం ఉన్నప్పుడు ఈ లోపం కనిపిస్తుంది. ఆకులు, కాడలు ఒకే రీతిలో ఊడక కొంత దళసరిగాను, కొంత పలుచగాను ఉండి అక్కడక్కడ గుండ్రటి మచ్చలు ఏర్పడుతాయి. పూత, మొగ్గ దశలో ఎండిపోవడం, చిన్నకాయలు రాలిపోవడం మొక్కలు గిడసబారి మొదలుపై పగుళ్లు ఏర్పడుతాయి. కాండం సరిగా అభివృద్ధి చెందక ఆకారం కోల్పోయి, పగుళ్లు ఏర్పడుతాయి.

నివారణ చర్యలు: బోరాన్ లోపించకుండా ఉండేందుకు ఎకరాకు 4 కిలోల బోరాక్స్ దుక్కిలో వేయాలి. బోరాన్ లోపం మొక్కలపై కనిపిస్తే పైరు విత్తిన 60, 90 రోజుల తర్వాత లీటరు నీటికి 1.5 గ్రాముల బోరాక్స్ వారం వ్యవధిలో మూడుసార్లు పిచికారి చేయాలి.

మెగ్నీషియం: ఈ దాతువు లోపం ఎక్కువగా సున్నపు నేలల్లో, పొటాష్ ఎక్కువగా ఉన్న నేలల్లో పండించే పంటలో కనిపిస్తుంది. మెగ్నీషియం లోపం పత్తిలో ఎక్కువగా ఉంటుంది. మెగ్నీషియం లోపం ఉన్నప్పుడు ముదురు ఆకులు అంచుల నుంచి మధ్య భాగానికి పసుపు రంగులోకి మారుతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయి.

నివారణ చర్యలు: మెగ్నీషియం లోపిస్తే లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి 45, 75 రోజులకోసారి పిచికారి చేయాలి. ప్రధాన పోషకాలు నత్రజని, పాస్ఫరస్, పొటాష్‌లు రైతులు ఏదో ఒక రూపంలో అందించాలి. దాని కంటే అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. సూక్ష్మ పోషకాల ఆవశ్యకత తెలియక రైతులు పురుగుమందులు వాడుతున్నారు. రైతులు వారి స్థాయిలో లోపాల లక్షణాలు గుర్తించి అన్ని ఎరువులు సమపాళ్లో వాడితే పెట్టుబడి తగ్గి దిగుబడిని పెంచుకోవచ్చు.

శరన్నవరాత్రుల్లో పలు సేవలు రద్దు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శ్రీ శారదీయ శరన్నవరాత్రుల సందర్భంగా పలు సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 11 వరకు అభిషేకం, 9న అక్షరాభ్యాసములు తప్ప మిగతా అర్జిత సేవలు, వీఐపీ పాసులు, 11 నుంచి 13 వరకు చండీహోమం, 12న పూర్ణ హారతి, తదుపరి అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. భక్తులు సహకరించగలరని వారు కోరారు.

రేకుల షెడ్లు కూల్చివేత



షెడ్లను కూల్చివేసిన దృశ్యం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని చున్నంబట్టివాడలో గల ఉమర్‌మియా సొసైటీలో నిర్మించిన ఐదు రేకులషెడ్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. సొసైటీకి సంబంధించిన భూవివాదాల కారణంగా రెండు వర్గాలకు చెందిన వారు కోర్టుకు వెళ్లారు. ఈక్రమంలో రేకుల షెడ్లను కూల్చివేసిన సంఘటన కలకలం రేపింది. రాత్రి వేళ కూల్చివేతల వెనుక రెండు వర్గాల్లో ఎవరైనా ఉన్నారా, లేక ఇతరుల ప్రమేయం ఉందా లేదాని తెలియాల్సి ఉంది. కూల్చివేతలకు సంబంధించిన సమాచారం తెలియదని అధికారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న ఎల్లంపల్లి గేట్ల ఎత్తివేత



ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటిని విడుదల

మంచిర్యాలరూరల్(హాజీపూర్) మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లఎత్తివేత కొనసాగుతోంది. 20 గేట్లను ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు 147.95 మీటర్ల నీటి మట్టం ఉండగా, మొత్తం 20.175 టీఎంసీలకు గాను 20.100 టీఎంసీల నీటిలు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో కింద ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 1.35 లక్షల క్యూసెక్కుల వరకు వరద వస్తోందని తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 300 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, 20 గేట్ల నుంచి 1.30 లక్షల క్యూసెక్కులు గోదావరికి విడుదల చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసుల అత్యుత్సాహం

- ఒకరిపై లాఠీ ఝుళిపించిన పోలీసులు
- జిల్లా కేంద్రంలో ఘటన

మంచిర్యాలక్రైం: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గౌతమినగర్‌కు చెందిన ఎండీ సాబీర్.. రంగంపేటలో ఎలక్ట్రీషియన్ వర్క్ చేసి ఆదివారం సాయంత్రం బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. బైపాస్‌రోడ్‌లో రాత్రి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సాబీర్ రాగా, పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. ఆయన ఆగకుండా ముందుకెళ్లగా కానిస్టేబుల్ లాఠీని అడ్డుపెట్టగా అతని గొంతుకు తగిలి కింద పడిపోయాడు. సాబీర్‌ను పైకి లేపి లాఠీ ఝుళిపించారు. స్థానికులు అతన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా, లాఠీని అడ్డం పెట్టలేదు. చెయ్యితో ఆపేందుకు ప్రయత్నం చేయగా కిందపడిపోయాడని తెలిపారు.